# ఏ రూటైనా ఒక్కటే

"ఇది నీకు పుట్టిన బుద్ధేనా?" ఒళ్ళంతా ఎగరేసుకుంటూ పెద్దగా నవ్వుతూ అడిగాడు దినేశ్ నాయుడు.

"హీ హీ" అంటూ పండ్లు బయటపెట్టి నవ్వాడు ఆనంద్ దీపక్.

అసలు ఆయన పేరు అంజయ్య, సినిమా ఫీల్డుకు వచ్చిన తర్వాత ఆనంద్‌దీపక్ అని పేరు మార్చుకున్నాడు. ఏవో సీ క్లాసు సినిమాలకు దర్శకత్వం వహించాడు. కథ ఏం లేకపోయినా సాంకేతిక విలువలేవీ లేకపోయినా కొత్త సినిమా తారలను పెట్టి శృంగారం గుప్పించి ఆ సినిమాలు తీసాడు. దాన్ని శృంగారం అనడం కన్నా 'పోర్నో' అనడం సరిగ్గా సరిపోతుందన్నారు సమీక్షకులు, విమర్శకులు. ఏది ఏమైనా ఆయన దర్శకత్వం వహించిన సినిమాలు వాటి నిర్మాతలకు వాళ్ళు పెట్టిన డబ్బుపోగా కొంత లాభాలు కూడా గడించి పెట్టాయి. మొత్తం మీద దీపక్ కొత్త సినిమా తారలను పరిచయం చేసిన కీర్తిని కూడా కొట్టేశాడు. ఒకసారి చేతులు కాల్చుకొని ఏదో విధంగా అంతో ఇంతో లాభాలతో బయటపడ్డ నిర్మాతలు మళ్ళా రెండోసారి అతన్ని సినిమా చెయ్యమని అడగడానికి భయపడ్డారు. అసలు ఈసారి ఆయన తీసే సినిమా సెన్సారు వాళ్ళ దగ్గరే ఆగిపోయే ప్రమాదముందని ఊహించి దీపక్‌ను దర్శకత్వం వహించమని అడగడానికి ముందుకురాలేదు. ఆయన అడిగినా ఏదో వంకతో తప్పించుకున్నారు.

ఆనంద్ దీపక్ మాత్రం తనను తాను లోబడ్జెట్ సినిమాలు తీసే మంచి డైరెక్టర్ననే అనుకుంటున్నాడు. బెంగాల్‌లో సత్యజిత్ రే ఎంతటివాడో తెలుగు సినిమారంగానికి అంతటివాడ్ని నేను అనుకుంటాడు. కాని ఒక్కటేమిటంటే తెలుగు సినిమారంగం ఆ విషయాన్ని గుర్తించేంత ఎత్తుకు ఎదగలేదని అతని బాధ.

ఇప్పుడు ఆనంద్‌దీపక్ తను దర్శకత్వం వహించదలచిన సినిమాను నిర్మించమని అడగడానికి ప్రసిద్ధ సినిమా నిర్మాత దినేశ్ నాయుడి దగ్గరికి వచ్చాడు. అతని వెంట రచయిత ప్రభాత్ కుమార్ కూడా ఉన్నాడు.

"సార్! ఈ ప్రభాత్ కుమార్ సార్థక నామధేయుడు. విప్లవాగ్నిని ప్రజ్వలింపజేసే కథ, మాటలు రాయడంలో దిట్ట. ఇప్పుడతని దగ్గర ఓ మంచి కథ రెడీగా ఉంది. మీరు దానికి నిర్మాత కావాలని మీ దగ్గరికి వచ్చాం" అన్నాడుదీపక్ పండ్లన్నీ బయటపెట్టి నవ్వుతూ.

"నేనేదో ఆడవాళ్ళనేడ్పించే చిన్న బడ్జెటు సినిమాలు తీసే ఈ సినిమారంగంలో స్థిరపడ్డాను. ఏదో ఆ సినిమాల మీద బతుకుతున్నాను. విప్లవం అంటూ నన్నెందుకు బజార్లోకి ఈడుస్తు న్నారు" నవ్వాడు దినేశ్ నాయుడు.

"కావల్సినంత డబ్బు సంపాదించారిన్నాళ్ళు. ఇక మీద పేరు సంపాదించే సినిమాలు తీయండి సార్! ఈ విప్లవ కథ తీస్తే మీకు తప్పకుండా అవార్డులూ,కీర్తి వస్తాయి. గ్యారంటీ!' అన్నాడు దీపక్. అవునన్నట్లుగా తలూపాడు ప్రభాత్ కుమార్.

"ఈ విప్లవం గిప్లవం అంటూ నన్నెందుకూ లాగుతున్నారయ్యా. దీంట్లో ఏం డబ్బు లాభముంటుంది!" అడుగుతున్నట్లుగా అన్నాడు నాయుడు.

"ఈ సబ్జెక్టులో లాభముంది గనుకనే దీనిక్కావల్సిన పెట్టుబడి మీరయితే పెడ్తారనే మీ దగ్గరికి వచ్చాం సార్! ఇప్పుడు జనం విప్లవ కథలకు ఎగబడ్తున్నారు. మీరు ఎక్కువగా పెట్టుబడి పెట్టక్కర్లేదు. డబ్బు ఆదా చేస్తూనే తీద్దాం. అంతెందుకు మీ మీద భారం పడనియ్యం. నిర్మాతగా మీ పేరుండాలె! అంతే" అన్నాడు దీపక్ గుక్క తిప్పుకోకుండా.

"ఇదిగో ఈయనేనా రైటర్. ఈయనెక్కడ్నో చూసినట్లున్నదే?" కనుబొమ్మలు ముడి వేసాడు దినేశ్ నాయుడు మెదడు మీద జోరు వేసి జ్ఞాపకం తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తూ.

"ఆఁ.... నువ్వు మన మోహన్ రాయుడు మర్డరు సినిమాకు కథ, సంభాషణలు రాసావ్ గదూ" అడిగాడు దినేశ్ నాయుడు తన జ్ఞాపకశక్తికి తనే ఆనందిస్తూ.

"అవునండి. అప్పుడు రాంబో పేరున కథ మాటలు రాసేవాడ్ని" అన్నాడు ప్రభాత్ కుమార్.

"ఇప్పుడు సబ్జెక్టుకు తగ్గట్లుగా పేరుండాలని రచయిత పేరు వినగానే కతేందో అందరికీ అర్థమైపోవాలని రాంబో నుంచి ప్రభాత్‌కుమార్‌గా మార్చాను" నవ్వాడు ఆనంద్ దీపక్ పండ్లన్నీ బయటపెడ్తూ.

"ప్రభాత్‌కుమార్ రాసిన కథ బలే జోరుగా ఉంది సార్! బాగా ఆడుతది. మీకు కనకవర్షమే కాదు కీర్తి ప్రతిష్టలు తెస్తుంది. ఈ సినిమా వచ్చాక దేశమంతా బెంగాలీ, మల యాళీ సినిమాలను మరచిపోతారు. ఇంటర్నేషనల్ అవార్డులు వచ్చినా ఆశ్చర్యపడనవసరం లేదు మనం" అన్నాడు దీపక్.

ఏమోనయ్యా ఈ విప్లవం గిప్లవం నాకు పడదు. ఏదైన మంచి ఏడ్చే కత - అదే ఏడ్పించే కత ఉంటే చెప్పు. సెట్టింగులనీ అవుట్‌డోర్‌లనీ ఎక్కువ ఖర్చు కానిదేమైనా కథ ఉంటే చూద్దాంగాని ఈ విప్లవం కత నా ఒంటికి పడదయ్యా" అన్నాడు నాయుడు మళ్ళీ.

"సార్! మీరన్నట్లుగా సెట్టింగులనీ, విదేశాల్లో అవుట్‌డోర్‌లనీ ఏమీ ఉండవు మీకు ఈ కథలో. స్టూడియోలోనే సినిమా అంతా షూట్ చేద్దాం" అన్నాడు దీపక్ చిరునవ్వుతో.

"నీ పేరు చూసి ఎవడు నువ్వు విప్లవ కథ తీస్తావని నమ్ముతాడయ్యా. సినిమాలకు రాకముందు ఆడపోరీల వ్యాపారం చేసినోడివట గదా! నీ బుద్ధి ఈ విప్లవం కథ దిక్కు పోయిందేమిటి?" పెద్దగా నవ్వాడు నాయుడు.

"సార్! మీరు విన్న మాటలన్నీ నమ్మకండి. లోబడ్జెట్‌తో ఓ మంచి సినిమా తియ్యాలని బుద్ధి పుట్టింది నాకు. మీరెట్లా అయినా ఫైనాన్స్ చెయ్యాలి దీనికి" మళ్ళీ ప్రాధేయపడ్డట్లుగా అన్నాడు దీపక్.

"సరే! పెట్టిన డబ్బుకు ఏ రిస్కు లేకుంటే అట్లాగే నిర్మాతనవుతాను. కాని కత బలంగా ఉండాలయ్యా. నలుగుర్ని ఏడ్పించే సీన్లు మాత్రముండాలి" దృఢంగా అన్నాడు నాయుడు.

"ఈ కథ విప్లవం కథనే గాని ఏడ్పు సీన్లకు కొదవేం లేదు. అన్నీ ఏడ్పించే సీన్లే. మీకెందుకు మీరు నిశ్చింతగా ఉండండి" అన్నాడు దీపక్ పండ్లు బయటపెడ్తూ.

"ఇంతకు కతేంది, కొంచెం చెప్పు!" అడిగాడు నాయుడు.

"ఓ మారుమూల గ్రామం. గ్రామంలో దొరలు" మొదలుపెట్టాడు దీపక్.

"హో! అయితే ఇది తెలంగాణా కతనా" అన్నాడు నాయుడు దీపక్‌ను మధ్యలోనే ఆపి.

దీపక్ మళ్ళీ కథ చెప్పడం మొదలుపెట్టక ముందే ప్రభాత్ కుమార్ అందుకున్నాడు.

"మరి విప్లవం పోరాటం అంటే అక్కడ్నే చూపించాలి కదండి. ఉద్యమ కాలం నుంచి ఆరని మంటల్లాగా భూమి కోసం పోరాటం జరుగుతున్నది అక్కడ్నే కదండి. మనిషికి భూమి మీద వుండే దాహం చల్లారేది కాదు. కాబట్టి భూమి పోరాటంలో వున్న కథ ఎప్పుడూ ఎట్లా వున్నా కొత్తగానే వుంటది. మనిషిని ఎన్నో సమస్యలు పీడిస్తున్నా భూమి సమస్యతో కూడిన కథ విప్లవాన్ని చిత్రించేటందుకు బాగుంటుంది. రక్తి కడుతుంది. దొర ఓ పిల్లను రేప్ చేస్తాడు. ఆ పిల్ల పెద్దదై పగబట్టి తుపాకి సేతబట్టి అందర్ని చంపుతుంది' ' చెప్పాడు రచయిత ప్రభాత్ కుమార్.

"ఏందిది శేఖర్‌సుమన్ తీసిన సినిమా లెక్కున్నది" అన్నాడునాయుడు.

"శేఖర్‌సుమన్ కాదండి. శేఖర్‌కపూర్. విప్లవం కథ అంటే రేప్‌లుండాలి. పగలు, ప్రతీకారాలు, హత్యలుండాలి. వాటితోపాటు ఈ కథలో వేడివేడి సంభాషణలు, పాటలు బలే రక్తికట్టేట్లు ఉంటాయి" అన్నాడు ప్రభాత్ కుమార్. అతని ముఖమంతా ఆనందంతో వెలిగిపోతున్నది.

"మరి కత ఏం కొత్తగా లేదు. ఈ సినిమా ఆడుతదంటవా?" అన్నాడు నాయుడు అనుమానంగా దీపక్ వైపు చూసాడు.

"మీరేం భయపడకండి! విప్లవం కథ ఎప్పుడు అట్లాగే ఉండాలి. తీయడంలోనే కొత్తదనం చూపిస్తాం. ఉదాహరణకు రేప్ సీన్ తీసుకోండి. దొర ఆ పిల్లను రేప్ చేసే సీను చూస్తే సినిమా హాలంతా దద్దరిల్లుతుంది. మా బాగా తీద్దాం ఆ సీను. ఆ సీను సినిమాలో హైలైటు అనుకోండి. ఇక ఆ పిల్ల తుపాకి పట్టి చెప్పే డైలాగులూ - అందర్నీ ఏడ్పిస్తాయంటే మీకేం సందేహం అవసరం లేదు. ఆ పిల్ల ప్రతీకారంతో చంపడం రక్తపాతం!...." చెప్పుకుపోతున్నాడు దీపక్.

''సరే! చివరికి ఏమౌతుంది. అదే ముగింపు ఎట్లా ఉంటుంది'' అన్నాడు కుతూహలాన్ని ప్రదర్శిస్తూ నాయుడు.

''చివరకా ? చివరకు మీరెట్లా ముగింపు చేయమంటే అట్లా చేద్దాం. దాందేముంది మీ ఇష్టం! డిస్ట్రిబ్యూటర్ల ఇష్టం!'' అన్నాడు దీపక్ చిరునవ్వుతో.

''కానీ ఇందులో డ్యూయెట్లు లేవా? అవి లేకపోతే జనం చూడరేమో?'' సందేహం ప్రకటించాడు నాయుడు.

''అయితే ప్రభాత్!'' - అని దీపక్, రచయిత ప్రభాత్ కుమార్ వైపు చూసాడు. ప్రభాత్ కుమార్ వెంటనే అందుకున్నాడు.

''ఏముంది మీరన్నట్లుగా ఆ పిల్ల ఇన్‌స్పెక్టరు చిన్నప్పటి దోస్తులని వాళ్ళిద్దరూ ప్రేమించుకున్నట్లుగా రెండు డ్యూయెట్లను డ్యాన్సులతో ఎక్స్ట్రా ఆర్టిస్టులతో పెడ్దాం'' అన్నాడు ప్రభాత్ కుమార్.

''సంభాషణలు మాత్రం మా జోరుగా ఉండాలయ్యా'' నాయుడు ప్రభాత్ కుమార్‌వైపు చూసి అన్నాడు. ప్రభాత్ కుమార్ అవునన్నట్లుగా తలూపాడు.

''మరి దీన్లో ఆ పిల్ల పాత్రకు ఎవర్ని పెడ్దామంటావ్'' అడిగాడు నాయుడు.

సినిమా తీయడానికి దినేశ్‌నాయుడు పూర్తిగా అంగీకరించినట్లేనని తెలుసుకున్న ఆనంద్ దీపక్ చాలా హుషారుగా ''ఇదో అక్కడే సార్! మీరు కాస్త చెయ్యి జారవిడువాలి. అక్కడొక్కచోట మీరు బడ్జెట్ పెంచక తప్పదు. పెద్ద హీరోయిన్‌నే తీసుకోవాలి. మిగతా అంతా ఖర్చు కాకుండా మేం చూసుకుంటాం'' అన్నాడు.

''సరే! మరి ఎవరైతే బాగుంటుందంటావ్'' అడిగాడు నాయుడు.

''మంజరి అయితే బాగుంటుందేమో'' నసిగాడు దీపక్.

''మంజరా? ఆమె అన్నీ ప్రేమకథల్లో శృంగారం డ్యాన్సలు చేసే పాత్రలు వేసింది గదయ్యా'' అనుమానం ప్రకటించాడు నాయుడు.

''అటువంటి ఫిగరున్న హీరోయినయితేనే ఈ పాత్రకు సరిపోతుందండి. సిగ్గూ ఎగ్గూ లేకుండా ఈ పాత్రను ధైర్యంగా చేస్తుంది'' అన్నాడు దీపక్.

''హా! అర్థమైంది. అర్థమైంది'' నవ్వాడు నాయుడు.

''అప్పుడే అనుకున్నాను. నువ్వేమిటి విప్లవం కథ ఏమిటి అని. ఇదన్నమాట ! ఈ రూటులో వచ్చావన్నమాట'' నవ్వాడు నాయుడు పెద్దగా.

- ఆంధ్రప్రభ ఆదివారం, 10 డిసెంబర్ 2000